క్లుప్తంగా

నేడు తలకొండపల్లిలో ఆచారి పర్యటన

తలకొండపల్లి: బీజేపీ సీనియర్ నేత ఆచారి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణశక్తికర్ణ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బీజేపీ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

కడ్తాల్: ఎంపీపీ అనితా విజయ్ అధ్యక్షతన ఈనెల 19న ఆమనగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ అనురాధ హాజరవుతారని తెలిపారు. సమావేశానికి మండలంలోని గౌరవ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు విధిగా తమ అజెండాతో హాజరుకావాలని పేర్కొన్నారు.

20న బాటసింగారంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

యాచారం: అబ్దుల్లాపూర్ మండలంలోని బాటసింగారంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించడానికి ఈనెల 20న వస్తున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గారి పర్యటనను విజయవంతం చేయాలని ఆపార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. యాచారంబీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ సర్కార్ ప్రజా హామీలను విస్మరించిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు రమేష్, జంగయ్యగౌడ్, కృష్ణ, పత్తి రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు స్పందన



దుస్తుల కొనుగోళ్లు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్పందన లభిస్తోంది. మేళాలో ఏర్పాటు చేసిన దుస్తులు, తదితర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, బనారస్, లక్నోచికాన్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, గాజులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

రోడ్లపై పడేసిన చెట్లకొమ్మలను తరలించండి

వనస్థలిపురం: కాలనీలలో విద్యుత్ తీగలకు చెట్లకొమ్మలు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది కొమ్మలను నరికి వాటిని తరలించకుండా రోడ్లపైనే వదిలేస్తున్నారు. రోజుల తరబడి చెట్ల కొమ్మలను తరలిచకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పాదచారులు, వాహనదారులు వాపోతున్నారు. కొమ్మలను తరలించాలని విద్యుత్ సిబ్బందిని అడిగితే జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తారని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇరు శాఖల అధికారులు సమన్వయం చేసుకుని చెట్ల కొమ్మలను తరలించాలని స్థానికుల కోరుతున్నారు.

విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న తీగలు



ఇబ్రహీంపట్నం: విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకున్నాయి. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో చెట్ల తీగలు స్తంభంపై వరకు అల్లుకోవడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్‌కు వెళ్లే దారిలో విద్యుత్ పోల్స్‌కు చెట్ల తీగలు అల్లుకుపోయాయి. నిత్యం విద్యుత్ అధికారులు, సిబ్బంది చూస్తున్నారే తప్ప తొలగించడం లేదు. గత కొన్నేళ్లుగా ఇదే సమస్యతో వినియోగదారులుఇబ్బందులుపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికే విద్యుత్ సరఫరా ఆగిపోతోంది. ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు నెరవేరిన కల



తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- తలకొండపల్లిలో ఇంటర్ కళాశాల కోసం 20 ఏళ్లుగా పోరాటం
- పార్టీలకతీతంగా దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు
- ఇటీవల కళాశాల మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిన సర్కార్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తలకొండపల్లి: తలకొండపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూర్ కావడంతో ఇక్కడి ప్రజల, విద్యార్థుల చిరకాల కల నెరవేరినట్లయ్యింది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లడుతూ.. తలకొండపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు చేసిందని.. ఈమేరకు జీఓ కూడా జారీచేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతి ఏడాది మండలంలోని సుమారు 1000 మందికి పైగా విద్యార్థులకు మేలు జరుగనుంది.

కళాశాల ఏర్పాటు చేయాలంటూ దీక్షలు..

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు చదువును పదోతరగతితోనే ఆపేస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ చదివే స్థోమత లేకపోవడం, ఇతర ప్రాంతాల్లో అద్దెకు ఉండి చదువుకోవడం వంటివి వ్యయప్రయాసలతో కూడుకోవడంతో నిరుపేద విద్యార్థులు పదోతరగతితోనే చదువు మానేస్తున్నారు. ఫలితంగా ప్రతి ఏడాది మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతుండేవారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, విద్యార్థులు గతంలో అనేక పర్యాయాలు రిలే నిరహార దీక్షలు నిర్వహించారు.

1000 మందికి పైగా విద్యార్థులకు మేలు..

మండల కేంద్రంతో పాటు చంద్రధన, వెల్జాల్, గట్టుఇప్పలపల్లి, ఖానాపూర్, చుక్కాపూర్, రాంపూర్, పడకల్‌లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలున్నాయి. ఇవిగాకా పదుల సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారుగా ప్రతి యేటా 1000 మందికి పైగా విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు. స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకావడంతో వీరందరికీ మేలు జరుగనుంది. ముఖ్యంగా బాలికలు ఇంటర్ చదివేందుకు అవకాశం ఉంటుంది.

అనేక పోరాటాలు చేశాం



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని 20 ఏళ్లుగా ఏబీవీపీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశాం. సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశాం. నాటి పోరాటాల ఫలితంగానే మండలానికి జూనియర్ కళాశాల మంజూరైంది. నిరుపేద విద్యార్థులు ముఖ్యంగా పదోతరగతి పూర్తిచేసిన బాలికలకు ఇంటర్ విద్య చదివించేందుకు ప్రోత్సహించినట్లయ్యింది.

– నీలకంఠం పాండు, బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి, తలకొండపల్లి

నిరుపేద విద్యార్థులకు మేలు



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అనేక పర్యాయాలు జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశాల్లో ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల సర్వసభ్య సమావేశాల్లో తీర్మాణం కూడా చేసి పంపించాం. మంత్రి సబితారెడ్డి, కలెక్టర్‌కు అనేకసార్లు వినతిపత్రాలు కూడా అందజేశాం. జూనియర్ కళాశాల ఏర్పాటుతో దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులకు మేలు జరుగనుంది.

– ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ, తలకొండపల్లి

ఎమ్మెల్యే సహకారంతోనే..



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతోనే మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరైంది. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే.. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఆయన కృషి ఫలితంగానే నేడు మండలానికి కళాశాల మంజూరైంది.

– ముజీబుర్ రహ్మాన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, తలకొండపల్లి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఇబ్రహీంపట్నం: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరంలా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యం బారినపడిన 8 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.3.6 లక్షల విలువైన చెక్కులను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి అందజేశారు. దండుమైలారం గ్రామానికి చెందిన శివకుమార్‌కు రూ.60 వేలు, రాములమ్మకు రూ.56 వేలు, బాలకృష్ణకు రూ.18 వేలు, సీహెచ్ నాగేశ్వరరావుకు రూ.10 వేలు, తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కోహెడకు చెందిన మనూషకు రూ.60 వేలు, రమేష్‌కు రూ.30వేలు, యాదమ్మకు రూ.20 వేలు విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. నిరుపేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

నిరుపేదలకు ఇళ్లు నిర్మించడమే లక్ష్యం



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఉప్పల వెంకటేశ్

- ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్
- కోనాపూర్‌లో ఐదు ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గంలో ఇళ్లులేని నిరుపేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇళ్లను నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. సోమవారం ఆమనగల్లు మండలం కోనాపూర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామంలో ఇళ్లులేక గుడిసెల్లో నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో గూడు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్లను నిర్మించడమే లక్ష్యంగా ట్రస్ట్ పనిచేస్తుందని తెలిపారు. గ్రామంలో పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న ఐదు కుటుంబాలకు పూర్తిగా ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. అదే విధంగా వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన 15 ఇళ్లను కూడా నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న జంగయ్య, జంగమ్మ, సాలయ్య, చిన్న రాములమ్మ, కమ్మరి నర్సమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు.

విజయవంతమైన వైద్య శిబిరం..

ఆమనగల్లు మండలం కోనాపూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఉప్పల వెంకటేశ్ సోమవారం ప్రారంభించారు. శిబిరంలో 235 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లమ్మ, రఘుపతి, నాయకులు యాదయ్య శ్రీశైలంగౌడ్, యాదయ్య, కిశోర్‌నాయక్, జగన్, విజేశ్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, డాక్టర్ అఖిల్, వైద్య బృందం పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్

మంచాల: టీపీపీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. ఆరుట్ల రైతువేదికలో రైతులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. కోట్లాది రూపాయాలు ఖర్చు పెట్టి సాగు నీటి కోసం అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందన్నారు. రైతుబీమా, రైతు బంధు వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తుందన్నారు. రైతు సంక్షేమం ఓర్వలేని రేవంత్ రెడ్డి వ్యవసాయానికి 3 గంటలు కరెంట్ చాలు అంటూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కోఆర్డినేటర్ చిందం రఘుపతి, నాయకులు శ్రీశైలం, జంగయ్య, రాము, మహేందర్, చంద్రయ్య, బీరప్ప, యాదయ్య, మదారి, నర్సింహ, వెంకటయ్య, రాజు, మదు, వెంకటేష్, లింగం, సూర్యం, లక్ష్మణ్, సాయి, మధు యాదవ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవునిపడకల్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న కాడమోని కృష్ణయ్య (57) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్రీశైలం, భవన నిర్మాణ కార్మికులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చు నిమిత్తం సర్పంచ్ రూ.3000, భవన నిర్మాణ కార్మికులు రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, జంగయ్య, లక్ష్మయ్య, రమేష్, మల్లేష్, వెంకటేషు, తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చేంతవరకు దీక్షలు కొనసాగిస్తాం



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారానికి 15వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి మాట్లాడారు. మండలం ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు. కార్యక్రమంలో దామోదర్, పాపిరెడ్డి, చెన్నయ్య, పవన్, వాల్మీకి, నర్సింహ, రామచంద్రయ్య, ఆంజనేయులు, ముత్యాలు, కృష్ణ, అంజయ్య, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ చట్టాన్ని రక్షించుకుందాం

వ్యవసాయ కార్మిక సంఘం

ఇబ్రహీంపట్నం: కార్మికులు తమ హక్కులకై పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సింహ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందామన్నారు. నియోజకవర్గ స్థాయి వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం సోమవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చూస్తోందన్నారు. ఉపాధి పనులకు అరకొర నిధులు కేటాయించడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేసిన పనులకు కూలీలకు బిల్లులు సకాలంలో చెల్లించడంలేదన్నారు. రోజు కూలీ రూ.600 చెల్లించి, 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం ఈనెల మొదటి వారంలో గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు ఇస్తామని ప్రకటించినా ఇప్పటికి అమలుకు నోచుకోలేదన్నారు. పెరిగిన సిమెంట్, స్టీల్, కూలీల రేట్లకు ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.3 లక్షలు సరిపోవని ఇంకా ఎక్కువ సాయం అందించాలని కోరారు. ఈనెల 22న రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజన్ భవన్‌లో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మయ్య, నర్సింహ, అంజయ్య, కృష్ణయ్యపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: వర్షపు నీటిని వృథా కానీయకుండా ఎక్కడికక్కడ ఇంకుడు గుంతల్లోనికి చేర్చగలిగితే భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు నరేందర్‌రెడ్డి, మల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, వెంకటయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.



ఇంకుడుగుంతల పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న భీంరెడ్డి

- మల్‌రెడ్డి సోదరుల తీరుతో కనుమరుగువుతున్న కాంగ్రెస్
- మాజీ ఎంపీపీ రొక్కం భీంరెడ్డి

తుర్కయంజాల్: మల్‌రెడ్డి సోదరులు వ్యవహరిస్తున్న తీరుతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని హయత్‌నగర్ మాజీ ఎంపీపీ, రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ రొక్కం భీంరెడ్డి ఆరోపించారు. సోమవారం తుర్కయంజాల్‌లో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అంతరించిపోయే స్థితికి చేరుకుందని, ఇలాంటి పరిస్థితుల్లో ఆ పార్టీలో ఉండి నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2020లో మున్సిపల్ ఎన్నికలకు ముందు భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటలు నమ్మి కాంగ్రెస్‌లో చేరామని, మల్‌రెడ్డి సోదరుల గురించి మాకు ముందునుంచి తెలుసన్నారు. చైర్‌పర్సన్ పదవి మార్పు విషయంలోనూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని, ఈ విషయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డికి ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లభించలేదని వాపోయారు. కార్యకర్తలకు, ప్రజలకు న్యాయం చేయాలంటే కాంగ్రెస్ పార్టీలో ఉంటే సాధ్యం కాదని విశ్వసిస్తున్నామని.. అందుకే పార్టీని వీడటానికి సిద్ధమయ్యామని తెలిపారు. కార్యకర్తలకు, ప్రజలకు న్యాయం చేయలేని పార్టీలో కొనసాగి ఏం లాభమన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 10మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు, పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులతో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీని వీడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, మల్లేష్, కోఆప్షన్ సభ్యులు పోరెడ్డి నర్సింహారెడ్డి, బ్యాంకు డైరక్టర్ జక్కం రాంరెడ్డి, నాయకులు గౌతమ్ రెడ్డి, శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, చిన్నయ్య, మాజీ సర్పంచ్ భిక్షపతి పాల్గొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీని వీడే వారిని బుజ్జగించే పనిలో మల్‌రెడ్డి బ్రదర్స్ నిమగ్నమైనట్లు సమాచారం.

మల్టీ పర్పస్ విధానాన్ని ఎత్తివేయాలి

- కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య
- 12వ రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె



ఇబ్రహీంపట్నం: కార్మికులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ నేత వీరేశం

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానాన్ని ఎత్తివేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల వీరేశం డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులనుద్దేశించి సోమవారం ఆయన మాట్లాడుతూ.. 12 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించకుంటే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు నర్సింహ, గ్రామ పంచాయతీ సంఘం నాయకులు యాదయ్య, దేవదాసు, నర్సింహ, భాస్కర్, సత్యనారాయణ, అండాలు, పోచమ్మ, రాములమ్మ, కిష్టమ్మ, లక్ష్మమ్మ, భారతమ్మ, అబ్బయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి..

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. నెలకు కనీసం రూ.19,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన 17 డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దైవానందం, కేవీపీఎస్ మండలాధ్యక్షుడు చెన్నయ్య, ఆ సంఘం నాయకులు.. కృష్ణ, నర్సింహ, లాలయ్య, లక్ష్మీదేవి, అంజయ్య, రామచంద్రయ్య, బాలమణి, రాములమ్మ, లక్ష్మమ్మ, కిష్టమ్మ, వెంకటమ్మ, పాండు, యాదయ్య, కార్మిక అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవలి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టవా..

మంచాల: పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చక్రపాణి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ అన్నారు. మంచాల మండల కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు సోమవారం వారు సంఘీభావం ప్రకటించారు. 12 రోజులుగా పంచాయతీ కార్మికులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కృష్ణ, సలాం, రాష్ట్ర మహిళ నాయకురాలు ఇందిర, మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, శ్రీను, ఐలయ్య, ఆనంద్, రాజేష్, వెంకట్‌రెడ్డి, శంకర్, మహేష్, సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భిక్షాటన..

కడ్తాల్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు గుమ్మడి కురుమయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. జీఓ 60 ప్రకారం ప్రతి కార్మికుడి వేతనాలు పెంచాలని, స్వీపర్లకు రూ.15,600, కారోబార్, బిల్‌కలెక్టర్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లకు రూ.19,500 వేతనం ఇవ్వాలని కోరారు. విధి నిర్వాహణలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని, ప్రమాదంలో మరణించిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. సీఐటీయూ కోకన్వీనర్ ఆశీర్వాదం, జీపీ కార్మికులు ఉన్నారు.

యాచారంలో రాస్తారోకో..

యాచారం: తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ సిబ్బంది యాచారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం రాస్తారోకో నిర్వహించారు. డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ సిబ్బందికి మద్దతుగా సీఐటీయూ నాయకులు సుధాకర్, పాండు, చందునాయక్, ఆలంపల్లి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: నిరసన తెలుపుతున్న కార్మికులు



కడ్తాల్: భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు